




నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

కర్నూలు నంద్యాల

గురువారం | 25 డిసెంబరు 2025

పేజీలు 8


# నేడు క్రిస్మస్



పశువుల పాకలో యేసుక్రీస్తు జనన ప్రతిమను ఏర్పాటు చేసిన దృశ్యం

- సుందరంగా రూపుదిద్దుకుంటున్నచర్చిలు
- మందిరాల్లో ప్రత్యేక ప్రార్ధనలు ప్రారంభం

**కర్నూలు కల్చరర్, మేజర్ న్యూస్ :** యేసుక్రీస్తు జన్మదినం పురస్కరించుకుని ప్రపంచవ్యాప్తంగా చేసుకునే పండుగను క్రిస్మస్ అంటారు. ఈ పండుగ శాంతి, ప్రేమ, కరుణ వంటి అంశాలకు ప్రతీకగా నిలుస్తుంది. ఇది క్రైస్తవులకు చాలా ముఖ్యమైన పండుగ. ఈ పండుగ సందర్భంగా ఇళ్లను, చర్చిలను శుభ్రం చేసి రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించుకుంటారు. ఇంట్లో వారు పిండి వంటలు తయారు చేస్తారు. కుటుంబంలోని పిల్లలు, పెద్దలు కొత్త బట్టలు ధరించి చర్చిల్లోని ప్రార్ధనలకు తరలివెళ్తారు.

మిగతా 2లో

# ప్రతిపక్ష పార్టీలో వర్గ చిచ్చు



- ఎమ్మిగనూరులో నువ్వా..నేనా అంటున్న బుట్టా,ఎర్రకోట
- కర్నూలులో చాపకింద నీరులా కొనసాగుతున్న అసమ్మతి
- ఒకనాటి కంచుకోటను బద్దలు కొడుతున్న నేతల వైరం
- వైకాపాను వీడని గ్రూపులు



2లో

ప్రతిపక్ష వైకాపాలో కుమ్ములాటలు వీధికెక్కాయి. ప్రజలు ఏడాదిన్నర క్రితం జరిగిన ఎన్నికల్లో పార్టీని ఊడ్చేసిన తర్వాత ఐక్యతను ప్రదర్శించాల్సిన నేతలు గ్రూపులుగా విడిపోయారు. బహిరంగంగానే ఆరోపణలు చేసుకుంటున్నారు. సింహ భాగం నియోజకవర్గాల్లో వైకాపా గ్రూపులుగా విడిపోయింది. 2019 ఎన్నికల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో క్లీన్‌స్వీప్ చేసిన వైకాపా 2024 ఎన్నికల్లో ఒకే ఒక్క స్థానానికి పరిమితమైంది. సార్వత్రిక ఎన్నికల ఫలితాలతో డీలాపడ్డ వైకాపా కార్యకర్తలు నేతల మధ్య 'వార్'తో అయోమయంలో పడ్డారు. త్వరలోనే స్థానిక సంస్థలకు ఎన్నికలకు తెర లేవబోతున్న తరుణంలో ఒక్కటిగా ఉండాల్సిన నేతలు విడిపోయి కొట్టుకుంటున్న తీరు పార్టీకి నష్టం కలిగిస్తుందన్న ఆవేదన పార్టీ వర్గాల్లో కనిపిస్తోంది. పార్టీ అధిష్టానం అధికారంలోని కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి ప్రారంభ మైందని, అది స్థానిక ఎన్నికల్లో ప్రతిబింబిస్తుందని ఆశిస్తుంటే జిల్లా నేతలు దాన్ని నీరుగారుస్తున్నట్లు కనిపిస్తోందని పార్టీ శ్రేణులు అంటున్నాయి. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో మూడు రోజులుగా చోటు చేసుకున్న పరిణామాలు పార్టీ వర్గాలను విస్మయానికి గురి చేస్తున్నాయి. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్ మధ్య తెర వెనుక మంటలు చెలరేగుతూనే ఉన్నాయి. కోడుమూరు, నందికొట్కూరు, పత్తికొండ తదితర నియోజకవర్గాల్లోనూ పార్టీలో ఐక్యత లోపించింది.

కర్నూలు, మేజర్‌న్యూస్ బ్యూరో

# గంజాయి సాగు,వినియోగం పై ఉక్కుపాదం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

- కర్నూలు జిల్లా కలెక్టర్ ,ఎస్పీ హెచ్చరిక

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** జిల్లాలో గంజాయి సాగు చేసినా లేదా గంజాయితో పట్టుబడినా చట్టప్రకారం కఠిన శిక్షలు తప్పవని జిల్లా కలెక్టర్ డా.ఏ సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్‌లు హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన మాదకద్రవ్యాల నియంత్రణ జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. గంజాయి సాగుపై సచివాలయ, వ్యవసాయ, ఉద్యాన వన సహాయకులు నిరంతరం నిఘా ఉంచాలని, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. పార్కులు, నిర్మాణుష ప్రాంతాల్లో వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని, మున్సిపల్ అధికారులు, పాఠశాలల గోడలపై మాదకద్రవ్యాల వ్యతిరేక సందేశాలను చిత్రించాలని

మిగతా 2లో

# టేస్టీ ఉప్పు.. ఆరోగ్యానికి ముప్పు..!

➲ పట్టించుకోని ఆహార భద్రత అధికారులు



టేస్టీ ఉప్పు

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** నోటి రుచి కోసం అధికంగా టేస్టీ ఉప్పును తీసుకుంటే ఆరోగ్య సమస్యలు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అధికారుల నిఘా, తనిఖీలు లేకపోవడం వల్ల వీటి వాడకం విచ్చలవిడిగా జరుగుతోంది. ఆరోగ్య నిపుణులు, ప్రభుత్వ ఆహార భద్రతా అధికారులు ఎప్పటికప్పుడు దాడులు చేసి హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను సీజ్ చేయాల్సి ఉన్నా మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. అధిక ఉప్పు దుష్ప్రభావాలపై అవగాహన కల్పించి నియంత్రణ చర్యలు తీసుకోవాలి. అయితే ఎక్కడా దాడుల జాడ కనబడడం లేదు.

మిగతా 2లో

# నల్లమలలో దొంగలు



2లో

జెసిబి సహాయంతో మట్టి తవ్విన దృశ్యం

## నదీనీరు బంద్
# వలసబాట మొదలు



2లో

బీడుగా మారిన వరిమడులు

సూర్య
గురువారం| 25 డిసెంబరు 2025

# నేడు క్రిస్మస్..

(మొదటి పేజీ తరువాయి)





అందంగా అలంకరించిన క్రిస్మస్ ట్రీ, క్రిస్మస్ సందర్భంగా ముస్తాబైన చర్చిలు

చర్చి ఆలయంలో చర్చి ఫాదర్స్, పాస్టర్లు, బిషప్‌లు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహిస్తారు. ప్రతి ఒక్కరూ కొవ్వొత్తులు వెలిగించి ఆకాశం పైకి ఎత్తి చూపుతూ యేసుక్రీస్తును ఆరాధిస్తారు. యేసుక్రీస్తు ప్రపంచానికి బోధించిన శాంతి, ప్రేమ, కరుణ, దయ వంటి బైబిల్‌లోని అంశాలను పాస్టర్లు, బిషప్‌లు క్రైస్తవభక్తులకు వివరిస్తారు. ఈ పండుగ సందర్భంగా క్రిస్మస్ చెట్టును రంగురంగుల స్టార్లతో బాల్స్‌తో క్రిస్మస్ గిఫ్ట్‌లతో మిరిమిట్లు గొలిపే విద్యుత్ దీపాలతో ఎంతో అందంగా చూపరులను ఆకట్టుకునే విధంగా ప్రత్యేకంగా అలంకరిస్తారు. కొందరు క్రిస్మస్ తాత రూపంలో ఎర్రటి దుస్తులు, తెల్లటి టోపి, చేతిలో బహుమతులు తీసుకొచ్చి పిల్లలకు అందచేస్తారు. ఈ సందర్భంగా ఆయా చర్చిల ప్రాంగణంలో పిల్లలకు, పెద్దలకు ప్రత్యేకంగా ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందచేస్తారు. బైబిల్ అనే అంశం మీద ప్రత్యేకంగా క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమానాలను అందచేస్తారు. ప్రత్యేకంగా క్రైస్తవ భక్తి గీతాలు ఆలపిస్తూ యేసుక్రీస్తును ఆరాధిస్తారు..స్తుతిస్తారు.

# టేస్టీ ఉప్పు..ఆరోగ్యానికి ముప్పు..!

(మొదటి పేజీ తరువాయి)

ప్రజారోగ్యం కోసం పూర్తిగా వాడకాన్ని తగ్గించాలి. కర్నూలు పట్టణంలో ప్రతి వీధిలో కనీసం మూడు లేదా నాలుగు హోటళ్ళు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, టిఫిన్ సెంటర్లు ఉన్నాయి. కనీసం నెలకోసారైనా దాడులు నిర్వహిస్తే వీటి వాడకం తగ్గుతుందని పలువురు పేర్కొంటున్నారు.

**దుష్ప్రభావాలు :** టేస్టీ ఉప్పు అతిగా తీసుకోవడం వలన నాడీ వ్యవస్థపై ప్రభావం పడుతుం దని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మెదడులోని నరాల కణాలను ఉత్తేజ పరిచి తీవ్రమైన తలనొప్పి, కళ్ళు తిరగడం వంటి సమస్యలకు దారి తీస్తుంది. అలాగే రక్తపోటును పెంచడంతో పాటు గుండె నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. కడుపులో మంట, వికారం, గ్యాస్ట్రిక్ సమస్యలతో పాటు శరీరంలోని హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీసి ఆకలిని పెంచుతోందని చెబుతున్నారు. నోటికి రుచి కనబడడంతో అతిగా తిని అధిక బరువు పెరుగుతారని చెబుతున్నారు. కొంతమందిలో చర్మంపై దద్దుర్లు, ముఖంపై వాపు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు కలుగవచ్చని అంటున్నారు. గర్భిణులు, చిన్న పిల్లలు దీనికి ఎంత దూరం ఉంటే అంత మంచిదని ఇది అధిక శాతం తీసుకుంటే మెదడు ఎదుగుదలపై ప్రభావం చూపుతోందని ఎన్నో అధ్యాయనాలు చెబుతున్నాయన్నారు. ముఖ్యంగా ప్రాసెస్ చేసిన ఆహారాలు నూడుల్స్, గోబి వంటి వాటిలో ఇవి ఎక్కువగా వాడుతున్నారని పూర్తిగా మానుకోవడం ఆరోగ్యానికి శేయస్కరమని చెబుతున్నారు. వైద్యాధికారులు, నిపుణులు ఎప్పటికప్పుడు దాడులు నిర్వహించి దాని వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

# గంజాయి సాగు, వినియోగంపై ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)

విద్యా శాఖ అధికారులకు సూచించారు. ఎస్పీ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా విద్యాసంస్థల్లో హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలని, 1972టోల్ ఫ్రీ నెంబర్‌పై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. మత్తు పదార్థాల వినియోగాన్ని గుర్తించే టెస్టింగ్ కిట్లను సిద్ధం చేయాలని వైద్య అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు, ఈగల్ టీం సభ్యులు పాల్గొన్నారు.

# నదీనీరు బంద్-వలసబాట మొదలు



వలసబాట పట్టిన సాతనూరు రైతులు

**కోసిగి మేజర్ న్యూస్:** తుంగభద్రనదిపై నిర్మించిన హోస్పేట్ డ్యాం గేట్లు మరమ్మత్తులు చేపట్టడంతో తుంగభద్ర నదికి నీటిని నిలిపివేస్తున్నట్లు అధికారులు ఆదేశాలు జారీచేయడం జరిగింది. దీనితో ఈ సంవత్సరం నదీతర గ్రామాలైన సాతనూరు, అగసనూరు, కందుకూరు నదీతీర గ్రామరైతులు వలసబాటను మొదలు పెట్టారు. ప్రతి సంవత్సరం తుంగభద్రనది కింద సంత్సరానికి రెండు పంటలు పండించే రైతులు నీరు లేకపోవడంతో ఈ సంవత్సరం కుంటుంబజీవనాధారం కష్టతరమవుతుందని వలసబాట పట్టారు. నదిలోనీరు లేకపోవడంతో వరిమడిలు పూర్తిగా బీడుబారి పోయాయి. ఇక్కడే ఉంటే మాకుటుంబ పోషణ ఇబ్బందిగా ఉంటుందని వలసబాట పడుతున్నారు.

# ప్రతిపక్ష పార్టీలో వర్గ చిచ్చు

(మొదటి పేజీ తరువాయి)

సార్వత్రిక ఎన్నికల్లో ఎర్రకోట కేశవరెడ్డి స్థానంలో ఎమ్మిగనూరు నుండి మాజీ ఎంపి బుట్టారేణుకను వైకాపా అధిష్టానం బరిలోకి దింపింది. కర్నూలు పార్లమెంట్ స్థానం ఆశించిన ఆమెకు అసెంబ్లీ టికెట్ చేతిలో పెట్టారు. ఆ ఎన్నికల్లో ఓటమి చవి చూసినా కోలుకుని నియోజకవర్గంపై దృష్టి సారించి పార్టీని బలోపేతం చేసుకునే దిశగా ప్రయత్నిస్తున్న బుట్టా రేణుకను హఠాత్తుగా కర్నూలు పార్లమెంట్ ఇంఛార్జ్‌గా నియమించిన అధిష్టానం ఆమె స్థానంలో ఎర్రకోట కేశవరెడ్డి మనువడిని నియోజకవర్గ ఇంఛార్జ్‌గా నియమించింది. ఇది రెండు వర్గాల మధ్య చిచ్చు రేపింది. ఎన్నికల సమయంలోనే బుట్టా రేణుక, ఎర్రకోట కేశవరెడ్డి మధ్య సరైన అవగాహన కుదరలేదన్నది పలు మార్లు స్పష్టమైంది. ఎర్రకోట కేశవరెడ్డి తనకు సహకరించడం లేదని బుట్టా అధిష్టానానికి ఫిర్యాదు కూడా చేసినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. అయినా తనకంటూ వర్గాన్ని తయారు చేసుకుని బలం పుంజుకునే ప్రయత్నం చేస్తున్న బుట్టా రేణుక తనను అక్కడి నుండి తప్పించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. తాజాగా ఎర్రకోట కేశవరెడ్డి కుమారుడు జగన్మోహన్‌రెడ్డి స్మశానాలను ఆక్రమించుకుని ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారంటూ పోలీసులకు బుట్టా రేణుక ఫిర్యాదు చేయడం సంచలనం సృష్టించింది. తాము ఎలాంటి భూకబ్జా చేయలేదని ఎర్రకోట కుటుంబం ప్రకటించుకోవలసి వచ్చింది. ఈ వ్యవహారం ఎమ్మిగనూరు నియోజకవర్గ వైకాపాలో కలకలం రేపుతోంది. ఇదిక్కడితో ఆగే పరిస్థితి కనిపించడం లేదు. రానున్న రోజుల్లో ముదిరి పాకాన పడే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో రెండు వర్గాలు మరింత వీధిన పడే పరిస్థితులు స్పష్టంగా ఉన్నాయి.

కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం వైకాపాలో ఎస్వీ మోహన్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్‌ల మధ్య దూరం అలాగే కొనసాగుతోంది. 2019 ఎన్నికల సమయంలోనే వీరిద్దరి మధ్య కోల్డ్ వార్ ప్రారంభమైంది. ఎన్నికల తర్వాత ఐదేళ్ల పాటు వీరిద్దరూ ఉప్పు, నిప్పులానే వ్యవహరించారు. 2024 ఎన్నికల్లో వీరికి కాకుండా ఐఎఎస్ అధికారి ఇస్మాయిల్‌ను పార్టీ కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం నుండి బరిలోకి దింపింది. ప్రస్తుతం ఎస్వీ మోహన్‌రెడ్డి కర్నూలు జిల్లా పార్టీ అధ్యక్ష స్థానంతో పాటు అసెంబ్లీ నియోజవర్గ ఇంఛార్జ్‌గా కూడా ఉన్నారు. పార్టీ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ కనిపించడం లేదు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కనిపిస్తున్న హఫీజ్ కర్నూలులో మాత్రం పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న తీరు చూస్తే ఎస్వీ, హఫీజ్ మధ్య సయోధ్య కుదరడం లేదన్నది స్పష్టమవుతోంది. కర్నూలు నగరపాలక సంస్థ పాలకవర్గ ఎన్నికలు త్వరలో జరగబోతున్న సంకేతాలు అందుతున్నా వీరిద్దరూ కలిసి పని చేయకపోవడాన్ని కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. కోడుమూరు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే సుధాకర్, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి మధ్య ఐదేళ్ల పాటు కొనసాగింది. ఒక మహిళను లైంగికంగా వేధించిన కేసులో అరెస్టు అయి డాక్టర్ సుధాకర్ ప్రస్తుతం నియోజకవర్గానికి దూరంగా ఉంటున్నారు. త్వరలోనే ఆయన మళ్లీ తెరమీదకు వచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. 2024 ఎన్నికల్లో ఇక్కడి నుండి పోటీ చేసిన డాక్టర్ సతీష్ , నియోజకవర్గ ఇంఛార్జ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి మధ్య చక్కని సంబంధాలు కొనసాగుతున్నాయి. 2029 ఎన్నికల్లో కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి కర్నూలు పార్లమెంట్ స్థానానికి పోటీ చేయాలని ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో వైకాపా నేతల మధ్య కొనసాగుతున్న వార్ పార్టీకి నష్టం కలిగిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# నల్లమలలో దొంగలు

- యధేచ్ఛగా ఎర్రమట్టి తవ్వకాలు
- బడా నాయకుల మద్దతు
- చోద్యం చూస్తున్న అధికారులు
- సంబంధిత శాఖల అధికారుల పనితీరు ఇదేనా అంటూ సమీప గ్రామాల ప్రజలు ఆగ్రహం

**బండిఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నంద్యాల జిల్లా కేంద్రానికి అతి సమీపమైన మండలం బండిఆత్మకూరు. మండలానికి ఉత్తరాన నారాయణాపురం నుంచి దక్షిణాన కడమలకాల్వ గ్రామం వరకు నాగార్జున సాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ ఆనుకుని ఉంటుంది. ఈ అడవి మార్గాన తెలుగుగంగ పథకంలో భాగంగా మద్రాసు నగరానికి నీరును తరలించే క్రమంలో ప్రధాన కాలువ ప్రవహిస్తుంది. అయితే ఎర్రమట్టి దొంగలకు ఈ ప్రధాన కాలువ ఆనుకుని వందల ఎకరాల పొడవున రాత్రి సమయాల్లో జెసిబిల సహాయంతో మట్టిని తరలించుకునిపోతున్నారు. గత కొంత కాలంగా ఇదే తంతు కొనసాగుతుంది. రెండు రోజుల క్రితం నుంచి తెలుగుగంగ ప్రధాన కాలువ వెంట ఉన్న ఎర్రమట్టిని మట్టి మాఫియా రాత్రి సమయంలో జెసిబిల సహాయంతో టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారని సమీప గ్రామాల ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. అయినప్పటికి సంబంధిత అధికార యంత్రాంగం మౌనం వహిస్తుంది. అధికారులు మౌనం వహిస్తున్నారంటే మట్టి మాఫియాకు బడా నాయకుల అండదండలు ఉన్నాయని తెలుస్తుందని సమీప గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. దొంగలు పడిన ఆరు నెలలకు వారు వస్తారు అన్నట్లుగా గత రెండు మూడు రోజుల నుంచి రాత్రి సమయాల్లో మట్టిని తరలిస్తున్నప్పటికి పట్టించుకోని అధికారులు చివరకు సోషల్ మీడియా ఆ విషయం చెక్కర్లు కొడుతుంటే తమకు ఇబ్బంది అవుతుందేమోనని అటవీ శాఖ అధికారులు మాత్రం మంగళవారం సాయంత్రం మట్టి తవ్వే ప్రదేశానికి వెళ్లి జెసిబిని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. మేజర్ న్యూస్ ప్రతినిధి అటవీ శాఖ అధికారులను వివరణ కోరగా తమ వద్దకు ఎవరు రాలేదని ఇంకా కేసు నమోదు చేయలేదని చెప్పుకొచ్చారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, సంబంధిత అధికారులు ఇలాంటి మట్టి మాఫియాను అరికట్టి అటవీ సంపదను కాపాడాలని తెలుగుగంగ ప్రధాన కాలువకు ముప్పు వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సమీప గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



అటవీ శాఖ అధికారుల స్వాధీనంలో ఉన్న జెసిబి

# ఖైదీల విడుదలకు సంబంధించి సుప్రీం కోర్టు ఆదేశాలు తప్పనిసరి

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** ఏడేళ్ల కంటే తక్కువ శిక్షకు లోబడే నేరాలకు సంబంధించి రిమాండ్‌లో ఉన్న ఖైదీల విడుదలకు సంబంధించి సుప్రీం కోర్టు ఆదేశాలు ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి తెలిపారు. జిల్లా జడ్జి కబర్థి ఆదేశాల మేరకు న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఒక ముఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో న్యూఢిల్లీ సుప్రీం కోర్టు ఆఫ్ ఇండియా వారు సటెన్‌డర్ కుమార్ అన్‌ట్లీ వర్సెస్ సిబిఐ అండ్ ఇతరుల కేసులో అండర్ ట్రయల్ ఖైదీలు (యుటిపిస్) సంబంధించి జారీ చేసిన ఆదేశాల అమలుకు రూపొందించిన, సవరించిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (రివైస్డ్ ఎస్ఓపి)పై విస్తృతంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం బెయిల్‌కు అర్హత కలిగిన అండర్ ట్రయల్ ఖైదీల విడుదలకు అవసరమైన చర్యలు తక్షణమే చేపట్టాలని సంబంధిత అధికారులను కోరారు. ముఖ్యంగా అండర్ ట్రయల్ ఖైదీల వివరాలను అండర్ ట్రయల్ ప్రిజనర్ కమిటీ (యుటిపిఎస్) ముందుంచి, విడుదలకు సంబంధించిన చర్యలు వేగవంతంగా చేపట్టాలని సూచించారు. ఈ విషయంలో జైలు అధికారులు, జైలు విజిటింగ్ లాయర్లు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌లు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా జైలు సూపరింటెండెంట్లు, అన్ని ఉప జైలు సూపరింటెండెంట్లు, విజిటింగ్ లాయర్లు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌లు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి

# మెరుగైన వైద్యసేవలు అందిచడం రేఖ నర్సింగ్‌హోం లక్ష్యం

★30 పడకల వైద్యశాల ఏర్పాటుకు ఆదరించారు

★వైద్యులు కార్తిక్, రేఖాసిందూరి

**ఎమ్మిగనూరు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** ఎమ్మిగనూరు ప్రజలు మా వైద్య వృత్తిని చూసి ఆదరించడంతోనే మీకు మరింత మెరుగైన సేవలు అందించడానికి రేఖ నర్సింగ్‌హోంనే 30 పడకలతో నూతన అద్దె భవనంలో ఏర్పాటు చేసే వెసులుబాటు కలిగిందని రేఖ నర్సింగ్‌హోం వైద్యులు ఆర్థో సర్జన్ డార్టర్ కార్తీక్, గైనాకాలజీ వైద్యులు డాక్టర్ రేఖ సిందూరిలు పేర్కోన్నారు. బుధవారం ఎమ్మిగనూరు పెద్దపార్కు సమీపంలో రేఖ నర్సింగ్ హోం నూతన భవనంలో ఆరంభించడం జరిగింది. ఈసందర్భంగా


వైద్యులతో వై ప్రదీప్ రెడ్డి

వారుమాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణంలో నాలుగేళ్ల క్రితం వైద్యసేవలు ఆరంభించాం.. నాటి నుండి ఎమ్మిగనూరు ప్రజలకు సరసమైన పెట్బుడికే వైద్యం చేయ్యడం జరిగిందన్నారు. మీ అందరి ఆదర అభిమానాలతోనే 30 పడకలతో వైద్య సేవలు అందిచే బాగ్యం కలిగిందన్నారు. పేదలకు మరింత చేరువగా మెరుగైన వైద్యం అందించడంతోనే మా వైద్య సేవల్లో తృప్తి పొందుతాం అన్నారు. ఇంకా అవసరమైన మేర 24 గంటలు అందుబాటు లో ఉండి రోగులకు ప్రాణాలకు రక్షణగా వైద్యం అందించడం జరుగుతుందన్నారు.

**హాజరు అయిన ప్రముఖులు .. :** ఎమ్మిగనూరులో రేఖ నర్సింగ్‌హోం ప్రారంభోత్సవానికి రాష్ట్ర వాల్మీకి ఫేడరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, వైసిపి నాయకులు వై ప్రతీప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కెఎస్ రఘు, టౌన్ బ్యాంక్ చైర్మన్ ప్రతాప ఉరుకుందయ్యశెట్టి, వ్యాపారవేత్త ప్రతాప్ రంగయ్యశెట్టి, డాక్టర్ బాలాజీ, బాజాపా నాయకులు దయాసాగర్‌లు హాజరు అయ్యారు.

# టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మను సత్కరించిన నాయకులు

**హొళగుంద,మేజర్‌న్యూస్ః** కర్నూల్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలుగా నియామకం అయిన గుడిసె ఆది కృష్ణమ్మను హొళగుంద మండలం హెబ్బటం నాయకులు శాల్వ కప్పి పూలమాలను వేసి సత్కరించారు. మంగళవారం ఆమే స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. హొళగుంద మండల అభివృద్ధికి తమ వంతుగా కృషి చేయాలని ఈ సందర్బంగా ఆలూరు మార్కెట్ యార్డు డైరెక్టర్ కురువ గోఫాల్, గ్రామ ఉప సర్పంచ్ యూనిట్ ఇన్‌చార్జీ బి.సవారప్ప, మండల కస్లర్ ఇన్‌చార్జీ బి.మల్లికార్జున, టీడీపీ గ్రామ ఉపాధ్యక్షుడు సూగూరునాగయ్య, బిజేపీ మండల ఉపాధ్యక్షుడు కాళప్ప, బూత్ కన్వీనర్ శేక్షావలిలు కోరారు.


జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మను సత్కరిస్తున్న హెబ్బటం నాయకులు

# సామాజిక రుగ్మతలను అధికమిస్తే సమాజాభివృద్ధి

**ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నవీన్‌పాఠీ**



మురుగు కాల్వలో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

**ప్యాపిలి, మేజర్‌న్యూస్ః** సామాజంలోని మనుషుల మద్య ఉన్న సమాజిక రుగ్మతలను అధికమించినాడే సమాజాభివృద్ధి సాధ్యపడుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి నవీన్ పాఠీ అన్నారు. జాతీయ సేవా పథకం స్పెషల్ క్యాంప్‌లో భాగంగా బుధవారం 4వ రోజు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సమాజిక సాధికార సర్వేను గ్రామంలో నిర్వహించి సమాచారాన్ని సేకరించారు. ఈ సందర్భంగా అధికారి నవీన్‌పాఠీ మాట్లాడుతూ సామాజిక సాధికారత అంటే సమాజంలోని అందరికీ సమాన అవకాశాలు, గౌరవం, శక్తి అందించడమని, ఇది కుల, మత, లింగ, ఆర్థిక వివక్షాలను తొలగించి, ప్రతి వ్యక్తిని సమాజంలో బలోపేతం చేయడం మన దేశంలో లక్షలాది మంది వెనుకబడిన వర్గాలు ఉన్నాయన్నారు. అలాంటి వారికి విద్య, ఉపాధి, గౌరవం లేకపోవడం వల్ల సమాజం విభజనకు గురౌతుందని, సామాజిక సాధికారత ద్వారా మాత్రమే నిజమైన సమానత్వం వస్తుందన్నారు. అనంతరం వాలంటీర్స్ మురుగు నీరు మన ఇంటి పరిసరాలలో నిల్వ ఉండడం వలన దోమలు చేరి మనకు అనేక రోగాలు రావడానికి రాణం అవుతాయని ప్రజలకు అవగాహన కల్పించారు. కావున మురుగునీరు నిల్వ ఉండకుండా కాలువలను అప్పుడప్పుడు శుభ్రం చేసుకోవాలని ప్రజలకు సూచించి, మురుగు నీటిపై బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ముస్తాక్, మురళీమోహన్, శంకరయ్య, వెంకటేశ్వర్లు, వన్నూరు, మంజునాథ్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# ఉచిత ప్రమాధ జీవిత భీమా చేయించుకోండి

**శిరివెళ్ల, మేజర్‌న్యూస్ :** మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో నివసించే కార్పెంటర్లకు ఆళ్లగడ్డకు చెందిన హరికృష్ణ టింబర్ డిపో యజమాని ఉచితంగా ప్రమాద జీవిత భీమా చేయించారు. యర్రగుంట్ల స్థానిక పోస్టాఫీసులో ఆళ్లగడ్డ ఇన్‌స్పెక్టర్ రామనాథ్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ఆళ్లగడ్డకు చెందిన టింబర్ డిపో యజమాని హరికృష్ణ ప్రత్యేక చొరవ తీసుకుని యర్రగుంట్ల గ్రామంలోని 30 మంది కార్పెంటర్లకు ఉచితంగా ప్రమాద భీమా చేయించడం అభినందనీయమని అన్నారు. భీమా జీవితానికి రక్షణగా ఉంటుందని తెలిపారు. దీనిని స్ఫూర్తిగా తీసుకుని ఆయన దగ్గర పనిచేసే వర్కర్లకు ప్రమాద భీమా చేయిస్తే కుటుంబానికి రక్షణగా ఉంటుందని తెలిపారు. హరికృష్ణ మాట్లాడుతూ కార్పెంటర్లు అందరికి తన బాధ్యతగా ప్రమాద భీమా


పోస్టాఫీసు వద్ద టింబర్ డిపో యజమాని, వర్కర్స్

చేయించానని అన్నారు. జనవరి 1వ తేదీన అందరికి బాండ్లు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ రావు, పోస్ట్‌మాస్టర్ భార్గవి, మహేంద్ర, లింగమూర్తి, ప్రేమ్‌కుమార్, నాగేంద్ర, వసీం, కార్పెంటర్లు బాలబ్రహ్మచారి, తదితరులు పాల్గొన్నారు.

# క్షేత్ర పర్యటన చేసిన విద్యార్థులు

**ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్ :**

విద్యార్థులు చదువుతో పాటు పాడి పంటల పట్ల అవగాహన కలిగి ఉండాలని మోడల్ స్కూల్ వృత్తి విద్య శిక్షకుడు హుస్సేన్ వలీ పేర్కొన్నారు. ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులతో గ్రామ సమీపంలోని వ్యవసాయ క్షేత్రాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పంటల పెరుగుదల విధానం, సాగునీటి వినియోగం, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వారికి ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. పొలంలో సాగు చేసిన పంటలను గమనించిన విద్యార్థులు రైతుల తో కలిసి సాగు విధానాలపై ప్రశ్న లు అడిగి వివ రాలు సేకరించారు. విద్యార్థులు పాఠ్య పుస్తకాలకే పరిమి తం కాకుండా ప్రాయోగిక జ్ఞానం పొందడం ఎంతో అవసరమని ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు.


విద్యారులకు అవగాహన కల్పిస్తున్న ట్రైనర్

# కార్మికుల శ్రేయస్సే ఐఎన్‌టియుసి ధ్యేయం


జిల్లా, సిటీ అధ్యక్షులను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** కార్మికుల శ్రేయస్సే జిల్లా ఐఎన్‌టియుసి ధ్యేయమని ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న అన్నారు. బుధవారం ఐఎన్‌టియుసి కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి హాజరై కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ వీధిలైట్లు వేసే ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్, మున్సిపాలిటీ కార్మికులతో సిటీ అధ్యక్షులు రేపల్లె ప్రతాప్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్బంగా అధ్యక్షుడు బతుకన్న మాట్లాడుతూ మీ సమస్యలు ఎంత జఠిలమైనవైన మనమందరం కలిసి పరిష్కరించుకుందామని మనతో కాకపోతే మన నాయకుడు జాతీయ అధ్యక్షుడు జి సంజీవరెడ్డి ముఖ్యమంత్రితో మాట్లాడుతాడన్నారు. సిటీ అధ్యక్షుడు రేపల్లె ప్రతాప్ మన ఐకమత్యమే మనకు బలమని అన్నారు. మీరందరు ఐకమత్యంగా ఉంటే రాబోయే రోజుల్లో దేనినైనా సాధించగలమని మీ ఐక్యతే ఐఎన్‌టియుసికి బలమని అన్నారు. అనంతరం కార్మికులు జిల్లా అధ్యక్షుడు బతుకన్న, సిటీ అధ్యక్షుడు రేపల్లె ప్రతాప్‌లను ఘనంగా సన్మానించారు.

## పూలే, ఫాతిమా షేక్‌ల జయంతి వారోత్సవాలను జయప్రదం చేయాలి

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** చదువుల తల్లులు సావిత్రి భాయ్ పూలే, ఫాతిమా షేక్‌ల జయంతి వారోత్సవాలను జయప్రదం చేయాలని రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ (ఆర్‌విఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయలసీమ రవీంద్రనాథ్ అన్నారు. బుధవారం ఓర్వకల్లు మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలలో సావిత్రిభాయ్ పూలే విగ్రహాల దగ్గర విద్యార్థులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ విముక్తి (బానిసత్వం) విద్యతోనే సాధ్యమని సావిత్రిభాయ్ పూలే చెప్పారన్నారు. సావిత్రిభాయ్ పూలే, ఫాతిమా షేక్‌లు బాలికల విద్య కొరకు నిరంతరం వారి జీవితకాలం శ్రమించి ఎనలేని కృషి చేశారన్నారు. సావిత్రిభాయ్ పూలే-ఫాతిమా షేక్‌ల జయంతి వారోత్సవాలను రాయలసీమ జిల్లాల వారిగా ఈ నెల 31నుండి జనవరి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలక్రిష్ణ నాయక్, రాజు, శేఖర్, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.


కరపత్రాలు విడుదల చేసిన ఆర్‌విఎఫ్ ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్

# మొక్కలను పెంచి ఆరోగ్యాన్ని పంచుదాం


మొక్కను నాటిన అధికారులు

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** మొక్కలను పెంచి ఆరోగ్యాన్ని పంచుదామని ఎంపిడిఓ నాగ అనసూయ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పూడిచెర్ల గ్రామంలో ప్లాగ్ ఫౌండేషన్ కింద షాట్స్ ఎన్జీఓ వాసు ఆద్వర్యంలో 500మొక్కలను నాటే కార్యక్రమంలో ఎంపిడిఓ నాగ అనసూయ, ఏపిఓ మద్దేశ్వరమ్మలు హాజరై మొక్కలను నాటారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా కాలుష్యం తొలగిపోతుందని, పరిశుభ్రమైన ఆక్సిజన్ లభిస్తుందని, వాతావరణంలో వేడి తీవ్రత తగ్గుతుందనీ, పర్యావరణానికి మేలు జరుగుతుందని అన్నారు. చెట్టు లేకపోతే ఏ జీవరాశి బ్రతకదని మొక్కలు పెంచాలని పచ్చదనం నింపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# వ్యాసరచన పోటీలో ప్రతిభ కనబరిచిన కళాశాల విద్యార్థులు

★ **అభినందించిన కళాశాల ప్రన్సిపాల్,అధ్యాపకులు**

**హొళగుంద,మేజర్‌న్యూస్ః** హొళగుంద ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు వ్యాసరచన పోటీలో ప్రతిభను కనబరిచారు. ఇటివల జాతీయ వినియోగదారుల దినోత్సవ కార్యక్రమంలో వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అందులో విద్యార్థులను ఎంపిక చేసి జిల్లా స్థాయి పోటీలకు పంపించగా ఎంపిసీ గ్రూఫ్ ఫస్టిఇయర్ ఇంగ్లీష్ మీడియం విద్యార్థిని ఎస్,ప్రవళిక ద్వితీయ స్థానం, సిఈసి విద్యార్థిని పి.రియాన్ తెలుగు మీడియం విద్యార్థిని తృతీయ స్థానంలో వచ్చారు. కర్నూల్ కెవిఆర్ గర్ల్స్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్వహకుల చేతుల మీదగా నగదు, ప్రశంస పత్రాలను అందుకన్నారు. ఈ సందర్బంగా ఆ విద్యార్థులను కళాశాల ప్రన్సిపాల్ ప్రవీణ, అధ్యాపకులు అభినందించారు.


ద్వితీయ స్థానంలో ప్రశంస పత్రాన్ని అందుకుంటున్న విద్యార్థిని

# మాజీ ఎమ్మెల్యే స్ఫూర్తితో అంతక్రియలకు ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయం చేస్తున్న కాంట్రాక్టర్

**ఆస్పరి, మేజర్ న్యూస్ :** ఆదోని మండల పరిధిలోని పెద్దతుంబళంలో వైఎస్సార్సిపి కాంట్రాక్ట ర్ బసవరాజు మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి స్ఫూర్తితో గ్రామంలో చనిపోయిన రబ్బలి వన్నూర్ సాబ్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఇందులో 1,7 వార్డుల మెంబర్లు మహ్మద్, వన్నూరు వలి, తాహేర్, కోసిగి రామరెడ్డి, బొంపల్లి ఈరన్న, కొండాపురం రామ్‌రెడ్డి, తలారి రామదాసులు ఉన్నారు.

# నెరవాటి పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

**-ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు**




**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :** స్థానిక నెరవాటి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ప్రీ-క్రిస్మస్ వేడుకలు అత్యంత ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగాయి.కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా బేత్లహేములో యేసు క్రీస్తు జన్మించిన ఘట్టాన్ని పురస్కరించుకుని విద్యార్థులు ప్రదర్శించిన నాటిక ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసింది. యేసు జన్మ రహస్యాన్ని, ఆయన లోకానికి చాటిన శాంతి సందేశాన్ని విద్యార్థులు తమ నటన ద్వారా కళ్లకు కట్టారు. అనంతరం క్రిస్మస్ గీతాలకు విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మొమిన్ ఫరాయతుల్లా మాట్లాడుతూ.. చదువుతో పాటు విద్యార్థులకు నైతిక విలువలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ అవసరంలో ఉన్న వారికి సహాయం చేయాలని, దయ, ప్రేమ, సహనంతో మెదలాలని కోరారు. పండుగలు మనుషుల మధ్య ఐక్యతను, సహోదర భావాన్ని పెంపొందిస్తాయని ఆయన తెలిపారు.

# ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

**– జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు**

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** జిల్లాలో యూరియా నిల్వలు సరిపడ ఉన్నాయని ఎంఆర్‌పి కంటే అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. గురువారం జిల్లా కేంద్రంలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను మండల ఏఓ ప్రసాద్ రావుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. శ్రీ శివసంతోష్ రెడ్డి ఏజెన్సీస్, దుర్గా భవాని పెస్టిసైడ్స్ దుకాణాలలో బిల్ బుక్కులు, రశీదులను, బయో ఉత్పత్తుల కంపెనీలకు సంబంధించిన అనుమతి పత్రాలు, నిల్వలను పరిశీలించారు. అలాగే యూరియా నిల్వలను, రోజువారి అమ్మకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ యూరియా వివరాలను ప్రతిరోజు వ్యవసాయ శాఖ రూపొందించిన బోర్డులో అప్‌డేట్ చేయాలని తెలిపారు. సరైన ధృవపత్రాలు లేనందున పలు బయో ఉత్పత్తుల కంపెనీలకు సంబంధించిన సుమారు రూ.1,34,000లు విలువ గల ఉత్పత్తుల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ అనుమతి పొందిన ఉత్పత్తులను విక్రయించాలని సూచించారు. అన్ని



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

ధృవపత్రాలు కలిగి ఉండాలని షాప్ యజమానులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక వ్యవసాయ అధికారి నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్.కె.ఆర్ పాఠశాలలో ఘనంగా ప్రీ-క్రిస్మస్ వేడుకలు

**అలరించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు**

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :** పట్టణంలోని ఎల్.కె.ఆర్ పాఠశాల ప్రాంగణంలో బుధవారం ప్రీ-క్రిస్మస్ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. పండుగను పురస్కరించుకుని పాఠశాల అంతటా క్రిస్మస్ శోభ సంతరించుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ నరేంద్ర నాథ్ రెడ్డి, డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ కవిత హాజరయ్యారు.పాఠశాల ప్రిన్సిపాల్ ఈ సందర్భంగా మాట్లాడుతూవిద్యార్థులు పాఠశాలను ఒక దేవాలయంగా భావించి, ఉన్నతమైన ఆశయాల సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.తల్లిదండ్రులే దైవాలని, వారు చెప్పే మంచి మాటలను పాటిస్తూ సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి విలువలని నేర్పించడంలో ఎల్.కె.ఆర్ పాఠశాల ఎప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు.




క్రిస్మస్ పండుగ విశిష్టతను చాటుతూ విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా అలరించాయి. పాఠశాల యాజమాన్యం తరపున కే.కళ్యాణ్ కుమార్ రెడ్డి, డాక్టర్ మురళీనాథ్ రెడ్డి పాల్గొని విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం.. కూటమి ప్రభుత్వ ధ్యేయం..

**డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోట్ల**



మహిళల నుండి వచ్చిన వినతులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

**డోన్, మేజర్‌న్యూస్ః** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ ధ్యేయంగా పాలన సాగిస్తుందని డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలోని 26వ వార్డులో గల తారకరామనగర్‌లో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటికి తగిన పరిష్కారాలు చూపాలనే లక్ష్యంతో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోట్ల పాల్గొని, స్థానిక వార్డు ప్రజలతో ముఖాముఖీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో వార్డులో నెలకొన్న త్రాగునీరు, రహదారులు, పారిశుద్యం, విద్యుత్, సంక్షేమ పథకాలు తదితర అంశాలపై ప్రజలు విన్నవించిన సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ ఇప్పటికే వార్డులో గ్రావెల్ రోడ్డు నిర్మాణంతో పాటు 30 విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లు ఏర్పాటు చేయించామన్నారు. అదేవిధంగా మున్సిపల్ కమీషనర్ ప్రసాద్‌గౌడ్ తక్షణమే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జరీ చేశారు.

# వాల్మీకులకు పెద్ద పీట వేసిన ఘనత సీఎం చంద్రబాబు

**మంత్రాలయం, మేజర్ న్యూస్ :** వాల్మీకులకు పెద్ద పీట వేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని మంత్రాలయం టీడీపీ ఇంచార్జీ రాఘవేంద్రరెడ్డి పేర్కొన్నారు. కర్నూలులో జరిగిన జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ ప్రమాణ స్వీకారమహోత్సవానికి హాజరైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టీడీపీ అంటేనే బడుగు బలహీన వర్గాల పార్టీ అని అన్నారు. వాల్మీకి మహిళా శక్తికి నాయకత్వ బాధ్యత అప్పగించినందుకు సీఎం చంద్రబాబుకు అలాగే మంత్రి నారాలోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గుడిసె కృష్ణమ్మ నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బసలదొడ్డి ఈరన్న, సురేష్ నాయుడు, జ్ఞానేష్, సతీష్ నాయుడు, మల్లికార్జున, నాయకులు, కార్యకరలు పాల్గొన్నారు.




# టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులుగా భాస్కర్ల చంద్రశేఖర్ ఎంపిక

**శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ శ్రేణులు**



చంద్రశేఖర్

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా ఎమ్మిగనూరుకు చెందిన టీడీపీ నాయకులు భాస్కర్ల చంద్రశేఖర్ ను ఎంపిక చేస్తూ రాష్ట్ర టీడీపీ అధిష్టానం బుధవారం ప్రకటించింది. చురుగ్గా పార్టీలో పనిచేసే కార్యకర్తలకు ఎమ్మెల్యే బీవీ. జయనాగేశ్వర రెడ్డి తగిన గుర్తింపు ఇస్తున్నారన్నారు. అనంతరం చంద్రశేఖర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవిని ఇచ్చిన సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే బీవీ. జయనాగేశ్వర రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని, స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యంగా ముందుకు పోతానని తెలిపారు. ఈ మేరకు నియోజకవర్గం టీడీపీ శ్రేణులు ఆయనకు పెద్ద ఎత్తున పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్ః** పవిత్ర క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని జరిగే వేడుకలకు పట్టణంలోని పలు క్రైస్తవ ప్రార్ధన మందిరాలలో సర్వం సిద్ధమయ్యాయి. అందులో భాగంగా బుధవారం పట్టణంలోని వైయస్.నగర్ నందు గల బైబిల్ మిషన్ ఏఓ రెవ బందెలరాజు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించుకునేందుకు ఏర్పాట్లను పూర్తి చేశారు. విద్యుత్ అలంకరణలతో ప్రార్ధన మందిరం కొత్త శోభను సంతరించుకుంది. ముందస్తు క్రిస్మస్ సందర్భంగా చర్చికి వచ్చిన క్రైస్తవులకు బందెల రాజు ఏసు సందేశాన్ని వినిపించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి వేడుకలు చేసుకున్నారు.



క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన బైబిల్ మిషన్ చర్చ్

# ఎస్సై పి. నరేష్ ను కలిసిన మాజీ ఎంపీపీ కొమ్ము వెంకటేష్




**తుగ్గలి,మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన తుగ్గలి పోలీస్ స్టేషన్ ఎస్ఐ గా పి. నరేష్ ఇటీవల బాధ్యతలు స్వీకరించడంతో బుధవారం మాజీ ఎంపీపీ వెంకటేష్ గిరిగేట్ల సర్పంచ్ మధుబాబు చౌదరి, మాజీ సర్పంచ్ బిసి వెంకటస్వామి, టిడిపి నాయకులు లక్ష్మీనారాయణ చౌదరి వెంకటప్ప, గోవిందు, జయరాం నాయక్ లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూలమాలతో సత్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుగ్గలి పోలీస్ స్టేషన్ కు కొత్తగా ఎస్ఐగా నరేష్ బాధ్యతలు స్వీకరించడంతో తాము మర్యాదపూర్వకంగా కలవడం జరిగిందన్నారు. మండలంలో శాంతి భద్రతలను పరిరక్షించి, ప్రజలందరూ ప్రశాంతంగా ఉండేందుకు కృషిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరినట్లు వారు తెలిపారు.

# ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే అఖిలప్రియ

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** వెదురు ఉత్పత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న చెంచులపై ఫారెస్ట్ అధికారులు విధించిన ఆంక్షల సమస్యను పరిష్కరించాలని రెండు రోజులుగా చేస్తున్ననిరసన నేపథ్యంలో, సీఎం చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం కలిసి వారి ఆవేదనను ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వివరించారు.ఈ అంశంపై ముఖ్యమంత్రి వెంటనే స్పందించి సంబంధిత ఫారెస్ట్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం సహకారంతో ఈ సమస్యకు పరిష్కారం చూపించి చెంచులకు పూర్తి స్థాయిలో అండగా ఉంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.



ముఖ్యమంత్రితో చర్చిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

# పార్వేట ఉత్సవాలకు ఆహ్వానం

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** శ్రీ లక్ష్మీనరసింహ స్వామి పార్వేట ఉత్సవ శోభాయాత్రకు టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్‌ను నంద్యాల మన ఊరు – మన గుడి – మన బాధ్యత సంస్థ మరియు ఇంటాక్ ప్రతినిధులు బాబురావు, శేఖర్‌లు ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు నంద్యాలలోని ఆత్మకూరు బస్టాండు శ్రీ లక్ష్మీగణపతి ఆలయం నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెంచులు విల్లు, బాణాలతో స్పృశించే అద్భుత ఘట్టం ప్రత్యేక ఆకర్షణగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మూలమటం చైర్మెన్ పసుపులేటి నారాయణ, నంద్యాల మార్కెట్ యార్డు డైరెక్టర్ స్వామి నాయక్, తోట రామయ్య, పుండరీకాక్ష రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పార్వేట ఉత్సవాలకు ఫయాజ్‌ను ఆహ్వానిస్తున్న దృశ్యం

# ఎకానమి

APPSC, TGPSC గ్రూప్-1, 2 JL, DL

PREVIOUS QUESTIONS

**1. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (యస్‌డిజిలు) కి సంబంధించి క్రింది ప్రకటనలో ఏవి చెల్లుబాటు అవుతాయి?**

1. 10వ లక్ష్యాన్ని సాధించడానికి యువకులకు సమాన వేతనం మరియు మంచి పనిని ప్రోత్సహించే ఆర్థిక వ్యవస్థ యొక్క మొత్తం సంస్కరణ అవసరం.
2. భారతదేశంలో యస్‌డిజిల పర్యవేక్షణను సులభతరం చేయడానికి నీతి ఆయోగ్ నేషనల్ ఇండికేటర్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఎఫ్)ను అభివృద్ధి చేసింది.
3. మిషన్ లైఫ్ స్థిరమైన వినియోగం మరియు ఉత్పత్తి రెండింటికి మద్దతు ఇవ్వడానికి ప్రభుత్వ మరియు పారిశ్రామిక విధానాన్ని ప్రభావితం చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది.
4. 4వ సుస్థిర అభివృద్ధి లక్ష్యము యస్‌డిజి4)లో పొందుపరచిన గ్లోబల్ సిటిజన్‌షిప్ భావన అనేది మెరుగైన లేబర్ మార్కెట్‌లను సులభతరం చేసే ఉద్దేశ్యంతో దేశాలలో అనువైన పౌరసత్వ హక్కులను సూచించే సూచన పదం.

సరైన సమాధానాన్ని ఎంచుకోండి :

1. అన్నీ  2. 1,2 మరియు 4
3. 3 మాత్రమే  4. 2 మరియు 4

**2. మానవ అభివృద్ధికి సంబంధించి క్రింది ప్రకటనలో ఏవి చెల్లుబాటు అవుతాయి?**

1. తలసరి స్థూల జాతీయ ఆదాయం (జిఎన్ఐ) ఒకే స్థాయిలో ఉన్న రెండు దేశాలు కానీ వివిధ మానవ అభివృద్ధి ఫలితాలతో ముగియడం అభివృద్ధి కంటే వృద్ధి యొక్క ప్రాముఖ్యతను సూచిస్తుంది.
2. అసమానతపై దేశం యొక్క స్కోర్ సర్దుబాటు చేయబడిన మానవ అభివృద్ధి సూచిక (ఐహెచ్‌డిఐ) ప్రజలలో అసమానత లేనప్పటికీ దాని మానవ అభివృద్ధి సూచిక (హెచ్‌డిఐ) వలె ఉండదు.
3. లింగ అభివృద్ధి సూచిక (జిడిఐ)లో, 1 కంటే తక్కువ విలువలు పురుషుల కంటే మహిళలకు అధిక అభివృద్ధిని సూచిస్తాయి.
4. ప్లానెటరీ ప్రెషర్స్ - అడ్జస్ట్ హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇండెక్స్ (పిహెచ్‌డిఐ) తరాల మధ్య అసమానత (ఇంటర్ జెనరేషన్ అసమానత) పై దృష్టి సారిస్తుంది, అదే విధంగా అసమానత - సర్దుబాటు చేసిన మానవ అభివృది సూచిక (ఐహెచ్‌డిఐ) తరంలోని వివిధ సమూహాల మధ్య అసమానత పై దృష్టి పెడుతుంది.
5. మానవ అభివృద్ధి నివేదిక 2021-22 ప్రకారం, ఒక కొత్త అనిశ్చిత సంక్లిష్టత ఏర్పడుతోంది, ఇందులో మూడు కొత్త ఆందోళనలు ఉన్నాయి. గ్రహాల మార్పులు, విస్తృతమైన సామాజిక పరివర్తనలు మరియు ధ్రువణ సమాజాలు.

సరైన సమాధానాన్ని ఎంచుకోండి :

1. 4 మరియు 5  2. 1,3 మరియు 5
3. 2 మరియు 3  4. 1,2 మరియు 4

**3. ఆరోగ్య పరిరక్షణ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జోక్యాలకు సంబంధించి క్రింది ప్రకటనలలో ఏవి చెల్లుబాటు అవుతాయి?**

1. డిస్ట్రిక్ట్ హబ్ ద్వారా స్పెషలిస్ట్ సేవలను పొందేందుకు అన్ని ఆయుష్మాన్ భారత్ హెల్త్ , వెల్నెస్ సెంటర్లలో టెలిమెడిసిన్ సౌకర్యం అందుబాటులో ఉంది.
2. కుటుంబ వైద్యుల పథకాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో (పిహెచ్‌సి) అనుసంధానించాల్సిన అవసరం లేకుండా ఒక స్టాండ్ ఎలోన్ ప్రాజెక్టుగా అమలు చేయడానికి ప్రణాళిక చేయబడింది.
3. కుటుంబానికి సంవత్సరానికి ఆదాయ పరిమితిని రూ. 2.5 లక్షల నుండి రూ. 5 లక్షలకు పెంచడం ద్వారా డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం పునరుద్ధరించబడినది.
4. ఆరోగ్య ఆసరా పథకం కొన్ని అర్హత షరతులతో ఆపరేషన్ అనంతరం జీవనోపాధి భత్యాన్ని అందించడానికి ఉద్దేశించబడినది.

సరైన సమాధానాన్ని ఎంచుకోండి :

1. 1. మరియు 4  2. 2,3 మరియు 4
3. 3 మరియు 4  4. 1,3 మరియు 4

**4. ఆంధ్రప్రదేశ్‌లో రవాణా మరియు మౌలిక సదుపాయాలకు సంబంధించి క్రింది ప్రకటన / ప్రకటనలలో ఏది/ఏవి చెల్లుబాటు అవుతాయి?**

1. కృష్ణానదిపై ముక్త్యాల మరియు మద్దిపాడు మధ్య ఆంధ్రప్రదేశ్‌లో మొదటి నదీ ప్రవాహ ప్రాజెక్టు ప్రతిపాదించబడినది.
2. నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (ఎన్ఐఐఎఫ్) నుండి సేకరించిన కార్పస్ ఫండ్‌తో భోగాపురం ఇంటర్నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ప్రారంభించబడినది.
3. ఆంధ్రప్రదేశ్‌లో మౌలిక సదుపాయాల పెట్టుబడులు ఓడరేవులు మరియు పారిశ్రామిక కారిడార్ల వంటి వ్యూహాత్మక పెట్టుబడులకు సంబంధించి మాత్రమే అమలు చేయబడతాయి, కానీ సమాజ ఆస్తులకు సంబంధించి కాదు.
4. సేతు బంధన్ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌లో రైల్



ఓవర్ బ్రిడ్జ్‌లు అభివృద్ధి చేయబడు తున్నాయి.

దిగువ ఇవ్వబడిన కోడ్‌లను ఉపయోగించి సరైన సమాధానాన్ని ఎంచుకోండి :

1. 1,2 మరియు 3  2. 4 మాత్రమే
3. 1 మరియు 4  4. 2 మాత్రమే

**5. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక విధానం 2023-27కి సంబంధించి క్రింది ప్రకటనలలో ఏది/ఏవి తప్పు?**

1. రాష్ట్ర జిడిపిలో పరిశ్రమల ద్వారా కనీస సహకారం 25% సాధించడానికి
2. 2 వారాల్లో ఎండ్-టు-ఎండ్ ఫెసిలిటేషన్ అందించడానికి
3. సాధనకు సంబంధించిన పది ప్రాధాన్యతలను ఊహించడం
4. పెట్టుబడుల కోసం ప్లగ్ & ప్లే స్టేట్‌గా మారడం పై దృష్టి పెట్టడానికి
5. దరఖాస్తు అందిన తర్వాత 2 వారాల వ్యవధిలో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్ లిమిటెడ్) (ఏపిఐఐసి) ద్వారా భూమి కేటాయింపును నిర్ధారించడం.

దిగువ ఇవ్వబడిన కోడ్‌లను ఉపయోగించి సరైన సమాధానాన్ని ఎంచుకోండి :

1. 2,3 మరియు 5  2. 1, 2, 3 , 5
3. 5 మాత్రమే  4. 3 మరియు 4

**6. ఆంధ్రప్రదేశ్ గ్రీన్ హైడ్రోజన్ మరియు గ్రీన్ అమ్మోనియా పాలసీ 2023 కి సంబంధించి క్రింది ప్రకటనలలో ఏవి చెల్లుబాటు అవుతాయి?**

1. రాబోయే ఐదేళ్ళలో 1 ఎమ్‌పిటిఏ (సంవత్సరానికి మిలియన్ టన్నులు) సామర్థ్యం వరకు గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లేదా 2.0 ఎమ్‌టిపిఏ సామర్థ్యం వరకు గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తిని లక్ష్యంగా చేసుకోవడం లక్ష్యం.
2. న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఎన్ఆర్ఇడిసిఏపి) (కొత్త మరియు పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ, ఎ.పి. లిమిటెడ్) ఈ పాలసీ కింద నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది.
3. రాష్ట్రంలోని అన్ని ఓడరేవుల్లో ద్రవ నత్రజని నిల్వ చేయడానికి మౌలిక సదుపాయాలు ఉన్నాయి. వీటిని ఇతర దేశాలకు ఎగుమతి చేయడానికి గ్రీన్ హైడ్రోజన్ నిల్వ చేయడానికి ఉపయోగించవచ్చు.
4. థర్డ్-పార్టీ / పవర్ ఎక్స్ఛేంజ్ నుండి పునరుత్పాదక శక్తి మరియు/ లేదా బయోమాస్‌ని ఉపయోగించడం ద్వారా గ్రీన్ హైడ్రోజన్ / గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తిని పాలసీ నిషేధిస్తుంది.

దిగువ ఇవ్వబడిన కోడ్‌లను ఉపయోగించి సరైన సమాధానాన్ని ఎంచుకోండి :

1. 2 మరియు 3  2. 1 మరియు 4
3. 1,2 మరియు 3  4. 3 మరియు 4

**జవాబులు :**
1)3 2)1 3)4 4)3 5)2 6)1

# జనరల్ సైన్స్

APPSC, TSPSC DSC SI of Police

**1. ఫ్రిజ్ నుండి తీసిన ఆపిల్ కంటే పుచ్చకాయ ఎక్కువ సేపు చల్లగా ఉండటానికి కారణం?**

1. అది పరిమాణంలో పెద్దగా ఉంటుంది కాబట్టి ఎక్కువ పదార్థం కలిగి ఉంటుంది.
2. అది ఎక్కువ విశిష్ట ఉష్ణం ఎక్కువగా ఉండే నీటిని కలిగి ఉంటుంది.
3. వాతావరణంలో ఉండే వేడిని పరావర్తనం చేసే ఆకుపచ్చ రంగును ఎక్కువగా కలిగి ఉంటుంది.
4. ఉష్ణాన్ని లోపలకు ప్రవేశింపనీయని దళసరి తొక్కను కలిగి ఉంటుంది.

**2. కింది వాటిలో ఏ శబ్ద పౌనఃపున్యము సాధారణ మానవ చెవికి వినిపించదు?**

1. 25  2. 1200
3. 15000  4. 30000

**3. వెన్న తీసిన పాల యొక్క విశిష్ట సాంద్రత ఎంత?**

1. వెన్న తీయని పాలకంటే ఎక్కువ
2. వెన్న తీయని పాలకంటే తక్కువ
3. ఏమీతేడా ఉండదు
4. విశిష్ట సాంద్రత నీటి కంటే తక్కువ

**4. క్రింది వానిలో ఏది సమానమైన బరువును పోల్చినపుడు ఎక్కువ కెఫిన్‌ను కలిగి ఉంటుంది?**

1. కాఫీ బీన్స్  2. తేయాకు
3. కాఫీ చాక్లెట్  4. మిల్క్ చాక్లెట్

**5. ఒక శాంకవ కుప్పెలో ఉన్న జింక్‌కు హైడ్రాలిక్ ఆమ్లాన్ని కలిపి మండుతున్న అగ్గిపుల్లను కుప్పె ముఖ ద్వారం వద్ద ఉంచితే ఏం జరుగుతుంది?**

1. కుప్పెలోని వాయువు దహనం కావడం వల్ల




మంట అంటుకుంటుంది.
2. అగ్గిపుల్ల ఆరిపోతుంది.
3. అగ్గిపుల్ల మామూలుగా మండుతుంది
4. అగ్గిపుల్ల బలహీనంగా మండుతుంది.క

**6. అమెరికాలోని లిబర్టీ విగ్రహం ఆకుపచ్చ రంగులో ఉండడానికి కారణం?**

1. రాగి క్షయకరణము
2. రాగి ఆక్సీకరణ చెందడం
3. ఆకుపచ్చ పెయింట్ ఉపయోగించడం
4. ప్రతి 30 ఏళ్ళకు ఒకసారి రంగు పాలిష్ వేస్తారు.

**7. క్రింది వానిలో ఏ మొక్కల్లో పత్రహరితము ఉండదు?**

1. నాగజెముడు పొర (కాక్టస్)
2. ఆర్కిడ్
3. బంగారుతీగ (కస్కూట లేక డాడర్)
4. అత్తిపత్తి

**8. క్రింది వానిలో ఏది పుట్టుకతో వచ్చే వ్యాధి?**

1. సికిల్ సెల్ రక్తహీనత  2. కుష్టు
3. పార్కిన్‌సన్ వ్యాధి  4. క్రోన్ వ్యాధి

**9. కండర పుష్టికి అథ్లెటిక్ క్రీడాకారులకు ఇది కావాలి?**

1. అధిక కాలరీలు కలిగిన ఆహారం
2. అధిక విటమిన్‌లు కలిగిన ఆహారం
3. అధిక గ్లూకోజ్ కలిగిన ఆహారం
4. అధిక ప్రోటీన్ కలిగిన ఆహారం

**10. మానవ ఊపిరితిత్తిలోని శ్వాసనాళాలను మొత్తాన్ని విడదీసి పరిస్తే అది ఎంత విస్తీర్ణం అవుతుంది?**

1. పెద్ద స్టేడియం  2. టెన్నిస్ కోర్టు
3. ఫుట్‌బాల్ మైదానం  4. చిన్న గది

**11. ఒక చెక్కముక్క మరియు ఒక ఇనుపముక్కలను కింది వానిలో 15 నిమిషాల పాటు ఉంచి బయటకి తీసి స్పృశిస్తే ఏది చల్లగా ఉంటుంది?**

1. చెక్క  2. ఇనుము
3. రెండూ చల్లదనములో సమానంగా ఉంటాయి
4. వాతావరణంపై ఆధారపడి ఉంటుంది.

**12. సున్నపురాయిని (కాల్షియం కార్బోనేట్) పరీక్ష నాళికలో ఉంచి సారాయి దీపంతో వేడిచేస్తూ, ఒక మండే అగ్గిపుల్లను పరీక్ష నాళిక ముఖం వద్ద ఉంచినపుడు ఏం జరుగుతుంది?**

1. మంట ఆరిపోతుంది
2. అగ్గిపుల్ల మరింత ప్రకాశవంతంగా మండుతుంది
3. అగ్గిపుల్ల అదే ప్రకాశంతో మండుతుంది
4. అగ్గిపుల్ల ఆరిపోతుంది.

**13. ముక్కిపోవటం ఒక**

1. క్షయకరణ చర్య  2. ఆక్సీరణ చర్య
3. తటస్థీకరణ చర్య
4. ఇచ్చిన సమాధానాలు ఏవీ కావు

**14. వాహనాలకు ఉండే రియర్ వ్యూ మిర్రర్**

1. సమతల అద్దం
2. పుటాకార అద్దం  3. కుంభాకార అద్దం
4. సగం పుటాకార, సగం కుంభాకార అద్దం

**జవాబులు :**

1)2, 2)4, 3)1, 4)2, 5)1, 6)2, 7)3, 8)1, 9)4, 10)2, 11)311)2, 12)1, 13)2, 14)3

# క్రీస్తు బోధనలు శాంతికి స్వరూపం

**– విద్యతో ఉన్నత శిఖరాలు– సిఐ**

**ఆస్పరి, మేజర్ న్యూస్ :** ఏసుక్రీస్తు బోధనలు శాంతికి స్వరూపమని చిన్న పిల్లలు బాగా చదివి ఎదగాలని, విద్యతోనే ఉన్నత శిఖరాలకు ఎదగాలని సిఐ గంగాధర్ పేర్కొన్నారు. బుధవారం ఆస్పరి మండలం ముత్తుకూరు రహదారిలో ఉన్న ఎవరీగ్రీన్ ఇంగ్లీష్ మీడియం స్కూలు ముత్తుకూరులో జాషువా ఫౌండేషన్ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ ఎం.దేవేంద్రయ్య పుట్టుకలమర్రి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా ఆస్పరి మండలం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ పాల్గొని క్రీస్తు యొక్క ప్రేమ బోధనలను శాంతి సమాధానానికి ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నటువంటి పండుగలు క్రిస్మస్ పండుగ ఒకటి అని పిల్లలకు తెలియజేశారు. అంతేకాకుండా క్రీస్తు ప్రేమను ఆయన జన్మ గురించి వివరించారు. పిల్లలు చక్కగా చదువు



సమావేశంలో మాట్లాడుతున్న సిఐ

కొని ఉన్నత ఉద్యోగాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూలు కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు, హెచ్ఎం వెంకటేశ్వరమ్మ, ఉపాధ్యాయులు సాయి, రవి, శీను, సరోజ, ఏసమ్మ, కళావతిలు పాల్గొన్నారు. సెమీ క్రిస్మస్ సందర్భంగా 300మంది పిల్లలకు జాషువా ఫౌండేషన్ వాలంటీర్లు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

# విధుల పట్ల బాధ్యతాయుతంగా ఉండాలి

**డిప్యూటి ఎంపిడిఓ ప్రభాకర్ జలదుర్గం-2 సచివాలయంను ఆకస్మీక తనిఖీ**



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటి ఎంపిడిఓ ప్రభాకర్

**ప్యాపిలి, మేజర్‌న్యూస్ః** గ్రామ సచివాలయ సిబ్బంది వారి విధుల పట్ల బాధ్యతాయుతంగా ఉండాలని, వారి విధుల పట్ల, ప్రజల సమస్యల పరిష్కారంలో ఏమాత్రం నిర్లక్ష్యం, అలసత్వం వహించినా సహించేదిలేదని డిప్యూటి ఎంపిడిఓ ప్రభాకర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని జలదుర్గం-2 గ్రామ సచివాలయాన్ని డిప్యూటి ఎంపిడిఓ ప్రభాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో భాగంగా గ్రామ సచివాలయం యొక్క రికార్డులను పరిశీలించి, ప్రభుత్వం ఆదేశాల మేరకు చేయవల్సిన సర్వేలపై సిబ్బందిని అడిగి ఆరా తీసి, విధుల పట్ల నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆదేశించారు. అదేవిధంగా గ్రామంలో ప్రభుత్వ హైస్కూల్ నందు విద్యార్ధులకు వడ్డించే మద్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం అందించాలని భోజన నిర్వహకులకు ఆదేశించారు.

# ఎల్ కె ఆర్ గ్లోబల్ స్కూల్లో ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

**-విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి ఫుడ్ ఫెస్టివల్ ఒక అద్భుతమైన వేదిక : ఎంఈఓ బ్రహ్మం నాయక్**

**-పిల్లల ఎదుగుదలలో పౌష్టికాహారం పాత్ర కీలకం: ఎల్ కె ఆర్ గ్లోబల్ స్కూల్ డైరెక్టర్ కళ్యాణ్ కుమార్ రెడ్డి**

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :** పట్టణంలోని పద్మావతి నగర్ లోని ఎల్.కె.ఆర్ గ్లోబల్ స్కూల్ లో బుధవారం నోరూరించే వంటకాలు, విద్యార్థుల సందడితో కళకళలాడింది. పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఫుడ్ ఫెస్టివల్' విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి, డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ కవిత, మండల విద్యాశాఖాధికారిబ్రహ్మం హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంఈఓ బ్రహ్మం నాయక్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో మన ఆహార సంస్కృతిపై అవగాహన పెరగడమే కాకుండా, వారిలో నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. పాఠశాల ప్రతినిధి కే.కళ్యాణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పిల్లల ఎదుగుదలలో పౌష్టికాహారం పాత్ర కీలక



మని వివరించారు. జంక్ ఫుడ్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, సంప్రదాయ ఆహార పదార్థాల ప్రాముఖ్యతను చాటిచెప్పారు. విద్యార్థులు స్వయంగా సిద్ధం చేసిన వివిధ రకాల ఆహార పదార్థాల స్టాళు అతిథులను ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలో డాక్టర్ మురళీనాథ్ రెడ్డి, ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు.కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు పాఠశాల యాజమాన్యం తల్లిదండ్రులకు, ఉపాధ్యాయ బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

# వాల్మీకి బోయలకు దక్కిన అరుదైన అవకాశం

**– జిల్లా టీడీపీ అధ్యక్షురాలికి ఘన సన్మానం – జనసేన ఇంచార్జీ వాల్మీకి లక్ష్మన్న**

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** వాల్మీకి బోయలకు అరుదైన అవకాశం కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్ష పదవి దక్కిందని మంత్రాలయం జనసేన ఇంచార్జీ వాల్మీకి లక్ష్మన్న పేర్కొన్నారు. బుధవారం కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షురాలుగా ఎన్నికైన గుడిసె కృష్ణమ్మను మంత్రాలయం జనసేన పార్టీ ఇంచార్జీ వాల్మీకి లక్ష్మన్న సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కర్నూలులో జరిగిన టీడీపీ అధ్యక్షురాలు ప్రమాణ స్వీకార మహోత్సవానికి హాజరైనట్లు తెలిపారు.



గుడిసె కృష్ణమ్మను సన్మానిస్తున్న జనసేన ఇంచార్జీ

ఈ కార్యక్రమంలో కర్నూలు ఎంపి నాగరాజు, కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, చైర్మన్ నాగేశ్వరరావు, టీడీపీ మాజీ అధ్యక్షులు తిక్కారెడ్డి, మంత్రాలయం ఇంచార్జీ రాఘవేంద్రరెడ్డి, మాజీ మంత్రి కె.ఈ ప్రభాకర్, జనసేన పార్టీ కోడుమూరు ఇంచార్జి ఆకేపోగు రాంబాబు, బోయ హక్కుల సంఘంరాష్ట్రనాయకులుశ్రీనివాస్‌నాయుడు,నాయకులందరూ పాల్గొన్నారు.

# భూరికార్డుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక క్యాంపులు

**గోనెగండ్ల,మేజర్ న్యూస్ :** గోనెగండ్ల మండలంలో రైతులకు సంబందించిన భూసమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు గాను ఈ నెల 26 నుంచి 31వ తేది వరకు ప్రత్యేక క్యాంప్లను ఏర్పాటు చేసు న్నట్లు తహసీల్దార్ రాజేశ్వరి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఈప్రత్యేక క్యాంప్లలో రైతుల నుంచి చుక్కల భూములు, నిషేధిత జాబితాలలో ఉండి



మాట్లాడుతున్న తహసీల్దార్ రాజేశ్వరి

రిజిస్ట్రేషన్ కు అన మతి లేని భూములు, అండగల్ లో ప్రభుత్వ భూములుగా నమోదై పట్టా భూముల సవరణ సంబంధిత సమస్యల పై దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాంప్లు ఈ నెల 26 నుంచి డిసెంబరు 31వ తేది వరకు ఉదయం 10 గంటల నుంచి మద్యహ్నం 2 గంటలవరకు గోనెగండ్ల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు. గ్రామాల వారిగా ప్రత్యేక క్యాంప్ల డిసెంబరు 26న అలువాల, అగ్రహారం, బైలుప్పల, కులుమాల, 27న నెరుడుప్పల, పెద్ద మరివీడు, ఐరన్బండ, వేముగోడు, 29న హెచ్ కైరవాడి, కున్నూరు, తిప్పనూరు, 30న పెద్దనేలటూరు, గంజహళ్లి, లింగందిన్నె, 31న ఎర్రబాడు, గోనెగండ్ల గ్రామలకు నిర్వహిస్తారని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరి రామయ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**మృతి చెందిన వ్యక్తి కైరవాడి వాసిగా గుర్తించిన పోలీసులు**

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** గోనెగండ్ల మండల పరిధిలోని హెచ్ కైరవాడి, పుట్టపాశం గ్రామాల మధ్య మంగళవారం రాత్రి పొద్దుపోయాక జరిగిన రోడ్డు ప్రమాదంలో హెచ్ కైరవాడి గ్రామానికి చెందిన కురువ గిడ్డయ్య మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు గిడ్డయ్య కు భార్య జయలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. గిడ్డయ్య పొలం పనులు, కూలీ పనులు చేస్తు జీవనం సాగించేవాడు. అయితే మంగళవారం రాత్రి తన పొలంలో సాగు చేసుకున్న పంటకు నీరు కట్టేందుకు తన ద్విచక్రవాహనం పై వెలుతున్నాడు. అయితే ఎమ్మిగనూరు కు చెందిన ఆర్టీసీ డిపో బస్సు (ఏపీ 21 జెడ్ 0664) మంగళవారం రాత్రి ఎమ్మిగనూరు నుంచి కర్నూలుకు బయలు దేరింది. హెచ్ కైరవాడి నుంచి కోడుమూరు వైపు వెలుతున్న గిడ్డయ్య ద్విచ క్రవాహనం ను బస్సు ఢీ కొనడంతో గిడ్డయ్య అక్కడి కక్కడే మృతి చెందాడు. మంగళవారం రాత్రి పోలీసులు గుర్తు తెలియని వ్యక్తిగా గుర్తించారు. అయితే బుధవారం ఉదయం గ్రామస్థులు, బంధువులు మృతుడు హెచ్ కైరవాడి కి చెందిన కురువ గిడ్డయ్య గుర్తించారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మృతి చెందిన కురువ గిడ్డయ్య

# క్రిస్మస్ సందర్భంగా జలకనూరులో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

**-అట్టహాసంగా ప్రారంభించిన నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త**

**-గెలుపు ఓటమిలో సమానంగా స్వీకరించాలి ఎమ్మెల్యే**

**మిడుతూరు మేజర్ న్యూస్:** మండల పరిధిలోని జలకనూరు గ్రామంలో క్రిస్టమస్ పండుగ సందర్భంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను అట్టహాసంగా నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయ సూర్య ప్రారంభించారు.జలకనూరు గ్రామంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ఏ బీ మ్ చర్చి పెద్దల సమక్షంలో కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి పోటీలనుఎమ్మెల్యే ప్రారంభించాడు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడలు



మానసిక ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని నింపుతాయని అన్నారు ఆటలో క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని క్రీడాకారులకు సూచించారు అనంతరం క్రీడాకారులతో కలిసి కబాడీ ఆడారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుండం శివరామిరెడ్డి సర్పంచ్ ఎల్లయ్య ,కృష్ణారెడ్డి, లక్ష్మీకాంతారెడ్డి, కమ్మ పెద్ద మద్దిలేటి, చిన్న మద్దిలేటి, గోకారి ,నిరంజన్, భాష ,మదిలేటి నాగేంద్ర క్రీడాకారులుతదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ః** రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందినట్లు ఎస్ఐ సునీల్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని సోమయాజుల పల్లె గ్రామానికి చెందిన అంద్రి లక్ష్మిదేవి(60) మహిళ సోమయాజులపల్లె దగ్గర జాతీయ రహదారి యూటర్న్ వద్ద రోడ్డు దాటుతుండగా కొనితేడు గ్రామానికి చెందిన నాగేంద్ర ద్విచక్ర వాహనం ఢీకొనడంతో గాయాలయ్యాయని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా కోలుకోలేక మృతి చెందిందన్నారు. మృతురాలి భర్త అంద్రి వెంకటలక్ష్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# జాయింట్ కలెక్టర్ నుండి ప్రశంసా పత్రాన్ని అందుకున్న విజయ్

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** నంద్యాల జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ నుండి ఆళ్లగడ్డ నియోజకవర్గం వినియోగదారుల రక్షణ మండలి అధ్యక్షులు విజయ్ బుధ వారం ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. జాతీయ వినియోగదారుల హక్కుల దినో త్సవం సందర్భంగా నంద్యాలలో జరిగిన కార్యక్రమంలో విజయ్ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ వినియోదారుల హక్కులు బాధ్యత లు గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించినందుకు తనకు ప్రశంస పత్రం లభించిందన్నారు.



# బాల్యవివాహాల నిర్మూలన ప్రతిఒక్కరి బాధ్యత – ఏఎస్ఐ లలిత

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ ః** బాల్య వివాహల నిర్మూలన ప్రతిఒక్కరి బాధ్యత అని వన్‌స్టాప్ సెంటర్ ఏఎస్ఐ లలిత అన్నారు. జిల్లా శిశు సంక్షేమ శాఖ పిడి ఆదేశాల మేరకు బుధవారం నగరంలోని ప్రభుత్వ బిసి కళాశాలలో బాల్యవివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు, వన్ స్టాప్ సెంటర్ సేవలు, హెల్ప్‌లైన్ నెంబర్ల గురించి వివరించారు. విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు.



డియస్సీ
గ్రూప్-1, గ్రూప్-2
జె.ఎల్.,

# జాగ్రఫీ



**1. విషవత్తులు అనగా**

1.మార్చి 21న, సెప్టెంబరు 23న ప్రపంచమంతా పగలు, రాత్రి సమానంగా ఉండుట.
2. జూన్ 21న సూర్యుడు కర్కటరేఖపై నిటారుగా పడుట.
3. డిసెంబర్ 22న, సూర్యుడు మకరరేఖపై నిటారుగా పడుట.
4. జూన్ 21న, డిసెంబరు 22న పగలు, రాత్రులు సమానంగా ఉండుట.

**2. భూభ్రమణ దశ**

1. తూర్పు నుండి పడమరకి
2. పడమర నుండి తూర్పుకు
3. ఉత్తరం నుండి దక్షిణంకి
4. దక్షిణం నుండి ఉత్తరంకి

**3. భూ పరిభ్రమణానికి పట్టు సమయం**

1. 365 రోజులు 2. 366 రోజులు
3. 365 రోజుల 5.56 గంటలు
4. 366 రోజుల 5.56 గంటలు

**4. అక్ష ధృవత్వం అనగా**

1. రాత్రి వేళల్లో దక్షిణాన ధృవనక్షత్రాన్ని చూడటం
2. భూమి అక్షం ఎల్లపుడు ఒకే వైపుకు ఉండకపోవటం
3. భూమి అక్షం అప్పుడప్పుడు ధృవనక్షత్రం వైపు ఉండటం.
4. భూమి అక్షం ఎల్లపుడు ధృవనక్షత్రాన్ని చూపించదు.

**5. క్రింది వాటిని పరిశీలింపుము.**

ప్రతిపాదన (ఎ) - సూర్యుడు తూర్పున ఉదయించి పశ్చిమాన అస్తమిస్తున్నాడు.
కారణం (ఆర్) - భూమి పడమర నుండి తూర్పుకి భ్రమణం చెందుతుండడం వలన.

1. (ఎ) మరియు (ఆర్) రెండూ సరైనవే మరియు (ఎ)కి (ఆర్) సరియైన వివరణ.
2. (ఎ) మరియు (ఆర్) సరైనవే మరియు (ఎ)కి (ఆర్) సరియైన వివరణ కాదు.
3. (ఎ) నిజమైనది కాని (ఆర్) నిజమైనది కాదు.
4. (ఎ) నిజమైనది కాదు కాని (ఆర్) నిజమైనది.

**6. క్రింది వాటిని జతపరచుము.**

| రోజు | సూర్యుని కిరణాలు ప్రసరించే అక్షాంశం |
|---|---|
| 1. మార్చి 21 | ఎ. $0^0$ అక్షాంశం |
| 2. జూన్ 21 | బి. భూమధ్యరేఖ |
| 3. సెప్టెంబరు 23 | సి. మకరరేఖ |
| 4. డిసెంబరు 22 | డి. కర్కటరేఖ |

1. 1-ఎ,2-బి,3-సి,4-డి
2. 1-బి,2-డి,3-ఎ,4-సి
3. 1-డి,2-సి,3-బి,4-ఎ
4. 1-సి,2-బి,3-ఎ,4-డి

**7. క్రింది ఏ పరిస్థితులు ధృవ ప్రాంతాల్లో కనిపిస్తాయి?**

ఎ. పగలు ఉన్న సమయంలో సూర్యుని కిరణాలు నిటారుగా పడతాయి.
బి. ధృవ ప్రాంతం సూర్యోదయం అయ్యే ప్రదేశానికి కొంచెం ఎత్తులో ఉంటుంది.
సి. ఆర్కిటిక్ సముద్రం సంవత్సరం పొడవునా గడ్డకట్టుకుపోయేంత చలి పరిస్థితులు ఉంటాయి.

1. ఎ మాత్రమే 2. ఎ మరియు సి
3. బి మరియు సి 4. ఎ,బి మరియు సి

**8. సూర్యుడి చుట్టూ భూమి తిరుగుతూ అక్షం వంగి**

## Earth Movements and Seasons

## భూ చలనాలు-ఋతువులు







## భూ చలనాలు - ఋతువులు

**లేదనుకుంటే క్రింది ఏ పరిస్థితి ఏర్పడి ఉండేది?**

1.ఇప్పుడు ఉన్న పరిస్థితులే ఉండావి.
2. ధృవాలకు ఎక్కువ వేడి లభించేది.
3. చంద్రుడిపై ఉన్న పరిస్థితులు భూమిపై ఉండేవి
4. ఉత్తర, దక్షిణార్ధ గోళాలకు ఒకే మోతాదులో వేడి లభించేది.

**9. క్రింది అంశాల వాస్తవికతను గుర్తించుము.**

ప్రతిపాదన (ఎ) - ధృవప్రాంతంలో వేసవికాలం (పగలు) ఉన్న 6 నెలల కాలంలో కూడా అంతగా వేడెక్కదు.
కారణం (ఆర్) - సూర్యోదయం అయ్యే ప్రదేశానికి (క్షితిజ రేఖ లేదా దిగ్మండలం) కొంచెం ఎత్తులో ధృవప్రాంతం ఉంటుంది.

1. (ఎ) మరియు (ఆర్) రెండూ సరైనవే మరియు (ఎ)కి (ఆర్) సరియైన వివరణ.
2. (ఎ) మరియు (ఆర్) సరైనవే మరియు (ఎ)కి (ఆర్) సరియైన వివరణ కాదు.
3. (ఎ) తప్పు కాని (ఆర్) నిజం
4. (ఎ) నిజం కాని (ఆర్) తప్పు.

**10.అర్ధరాత్రి సూర్యుడు ఉదయించే దేశం**

1. జపాన్ 2. ఇంగ్లాండ్
3. నార్వే 4. థాయ్‌లాండ్

**11.క్రింది వాక్యాలను పరిశీలించి వాటిలో సరైన అంశాలను గుర్తించుము.**

ఎ. భారతదేశంలో దక్షిణాన తమిళనాడు, కేరళ, అండమాన్‌లలో చలికాలంలో చాలా చల్లగా ఉండదు.
బి. ఈశాన్య రాష్ట్రాలలో వేసవికాలంలో చాలా వేడిమి ఉండదు.
సి. ఉత్తర భారతదేశంలో ఎక్కువభాగం ఈ మూడు కాలాల్లో వెచ్చని వేసవికాలాలు, చల్లటి శీతాకాలాలు మరియు వర్షపు ఋతుపవనాలు ఉండవు.

1. ఎ మాత్రమే 2. ఎ మరియు బి
3. బి మాత్రమే — 4. ఎ,బి మరియు సి

**12. క్రింది వాటిలో సరిగ్గా జత చేసిన దానిని గుర్తించుము.**

ఎ. భూమధ్యరేఖకు పూర్తిగా ఉత్తరాన ఉన్న ఖండం ఐరోపా
బి. భూమధ్యరేఖకు పూర్తిగా దక్షిణాన ఉన్న ఖండం ఆస్ట్రేలియా
సి. భూమధ్యరేఖకు ఉత్తరాన, దక్షిణాన విస్తరించిన ఖండం ఉత్తర అమెరికా

1. ఎ మరియు బి 2. బి మరియు సి 3. ఎ మరియు సి 4. ఎ,బి మరియు సి

**13.క్రింది వాటిలో ఏది కాలాల క్రమాన్ని ప్రభావితం చేయని అంశం?**

ఎ. భూమి బంతిలాగా గోళాకారంలో ఉండటం, దాని ఉపరితలం ఒంపు తిరిగి ఉండటం
బి. భూమి భ్రమణం చెందటం.
సి. భూమి చుట్టూ చంద్రుడు నెలకు ఒకసారి తిరగటం.
డి. సూర్యుడి చుట్టూ భూమి తిరిగే తలంతో పోలిస్తే తన చుట్టూ తాను తిరిగే అక్షం ఒంపు కలిగి ఉండటం.
ఇ. భూమి పరిభ్రమణం

1. ఎ మరియు బి 2. బి మరియు ఇ
3. సి మాత్రమే 4. డి మాత్రమే

**14.క్రింది అంశాల వాస్తవికతను గుర్తించుము.**

ఎ. సూర్యుడి చుట్టూ భూమి తిరుగుతున్నపుడు సంవత్సరమంతా దాని అక్షం ఒకే వైపుకు వంగి ఉండదు.
బి. అది ధృవనక్షత్రం వైపు చూపిస్తూ ఉండుటను 'అక్ష ధృవత్వం' అంటారు.
సి. రాత్రివేళ్ళల్లో ఉత్తరాన ధృవనక్షత్రం కనిపిస్తుంది.

1. ఎ & బి నిజం, సి తప్పు
2. ఎ,బి & సి నిజం
3. ఎ నిజం, బి & సి తప్పు
4. ఎ తప్పు బి మరియు సి నిజం

**15.క్రింది వానిలో సరిగ్గా జత చేసిన దానిని గుర్తించుము.**

ఎ. కర్కటరేఖ నుండి మకరరేఖకు మధ్య ఉన్న ప్రాంతం : ఉష్ణ మండలం.
బి. ఉష్ణమండలం - ధృవమండలం మధ్య ఉన్న ప్రాంతం : అతిశీతల మండలం.
సమ శీతోష్ణమండలం నుండి ధృవాల బిందువుల వరకు : శీతల మండలం.

1. ఎ మరియు సి 2. ఎ మరియు బి
3. బి మరియు సి 4. ఎ,బి మరియు సి

**16. భూమిపై కాలాల క్రమాన్ని ప్రభావితం చేయని అంశం?**

1. భూ భ్రమణం
2. భూమి అక్షం ఒంపు కలిగి ఉండటం
3. భూ పరిభ్రమణం
4. ఖండాలు, మహాసముద్రాల విస్తరణ

**17.భూమి అక్షం**

1. $66\frac{1}{2}^0$ వంగి ఉంది
2. $23\frac{1}{2}^0$ వంగి ఉంది
3. $90^0$ కోణంలో కక్ష్య తలంపై ఉంటుంది.
4. వంగి ఉండి, సంవత్సరమంతా ఒకే వైపుకు ఉండదు.

**18.క్రింది వాటిలో సరిగ్గా జతపరచిన వాటిని గుర్తించుము.**

ఎ. కర్కటరేఖపై నిటారుగా సూర్యకిరణాలు పడే నెల జూన్
బి. మకరరేఖపై నిటారుగా సూర్యకిరణాలు పడే నెల డిసెంబరు.
సి. భూమధ్య రేఖపై నిటారుగా సూర్యకిరణాలు పడే నెలలు జనవరి, అక్టోబరు.

1. ఎ మరియు సి 2. బి మాత్రమే
3. ఎ మరియు బి 4. సి మాత్రమే

**19.పగలు-రాత్రులు సంభవించడం, స్థానిక ఉష్ణోగ్రతలు గాలులు కదలికలకు కారణం క్రింది వాటిలో ఏది?**

1. భూ భ్రమణం 2. భూ పరిభ్రమణం
3. చంద్రుడు భూమి చుట్టూ తిరగడం
4. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ భూమి చుట్టూ తిరగడం.

**20.సూర్యుడు ప్రకాశవంతంగా చేసే భూమి యొక్క గోళాకారపు అంచును ఏమంటారు?**

1. ప్రకాశ అంచు 2. ప్రకాశ భూమి
3. ప్రకాశ అర్ధవృత్తం 4. ప్రకాశ వృత్తం.

**జవాబులు :** 1)1, 2)2, 3)3, 4)4, 5)1, 6)2, 7)3, 8)4, 9)1, 10)3, 11)2, 12)1, 13)3, 14)4, 15)1, 16)4, 17)2, 18)3, 19)1, 20)4



**పాదం సుధాకర్**
ఫ్యాకల్టీ
9849972622

## రచనలకు ఆహ్వానం

పోటీ పరీక్షలకు అత్యుత్తమ మెటీరియల్, గైడెన్స్ అందిస్తూ 'ప్రజ్ఞ' విద్యార్థుల మన్ననలందుకుంది. 'ప్రజ్ఞ'ను మరింత ఉపయోగకరంగా తీర్చి దిద్దేందుకు అధ్యాపకులు, ఔత్సాహికుల నుంచి రచనలను (మెటీరియల్) ఆహ్వానిస్తున్నాం. ఏపీపీఎస్సీ , టీజీపీఎస్సీ, ఆర్ఆర్బీ, ఎస్ఎస్సి, బ్యాంక్, డీఎస్సీ తదితర పోటీ పరీక్షల మెటీరియల్‌ను సులభరీతిలో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా రాయగల అధ్యాపకులు మెటీరియల్‌ను 'ప్రజ్ఞ' ఇమెయిల్ (suryaapragna71@gmail.com)కు లేదా 7288890072 వాట్సప్ నెంబరుకు పంపవచ్చు. రచనతో పాటు ఫోటో, ఫోన్ నెంబర్, అడ్రస్ తదితర వివరాలను జత చేయాలి.